ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 6 ఆగస్టు 2025



కోవై, నీలగిరి జిల్లాలకు

రెడ్ అలర్ట్



వానజల్లులో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



సిద్ధంగా ఉన్న ఎండీఆర్ఎఫ్ బృందాలు

- ఊటీలో పర్యాటక ప్రాంతాల మూసివేత
- ఎండీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో నీలగిరి, కోవై జిల్లాల్లో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధనా కేంద్రం హెచ్చరికలతో ఈ రెండు జిల్లాకు రాష్ట్రప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. రుతుపవన ద్రోణి, మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా, కొండ ప్రాంతాల్లో బుధవారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. దీంతో అప్రమత్తమైన రాష్ట్రప్రభుత్వం కోవై, నీలగిరి జిల్లాల్లో పర్యాటక ప్రాంతాలను మంగళవారం మూసివేయడంతో పాటు ఊటీ మౌంట్ రైలు సేవలను తాత్కాలికంగా రద్దుచేసింది. బుధవారం తేని, తెన్‌కాశి జిల్లాల్లో మోస్తరు నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని, దిండుగల్, తిరుప్పూర్, కృష్ణగిరి, ధర్మపురి, సేలం జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ మేరకు ఎండీఆర్ఎఫ్ విభాగం సీఐ దీపక్ నేతృత్వంలో 10 మంది సభ్యుల బృందం మంగళవారం ఊటీలో మకాం వేసింది. కోవై జిల్లా వాల్పారైలో ఇప్పటికే ఎండీఆర్ఎఫ్ బృందం వరద నివారణ పనులకు సిద్ధంగా ఉంది. భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున పర్యాటక ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి.

రాజధానిలో ట్రాఫిక్ సమస్యకు

మరో పరిష్కార మార్గం

- కొచ్చిన్ స్ఫూర్తితో 'వాటర్ మెట్రో స్కీమ్'
- నేపియర్ బ్రిడ్జి నుంచి ఈసీఆర్ వరకు పడవ ప్రయాణం
- సాధ్యాసాధ్యాలపై నేడు సమీక్షా సమావేశం



టి.నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చల్లటి బోగీలున్న రైళ్లను నేలపై, సొరంగమార్గంలో, వంతెనలపై నడిపి నగరవాసులను పలు ప్రాంతాలకు తరలిస్తున్న చెన్నై మెట్రో సంస్థ మరో విప్లవాత్మకమైన పథకం చేపట్టేందుకు సిద్ధమవుతోంది. నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కలిగించి, అదే సమయంలో నగరవాసులకు అద్భుతమైన జలప్రయాణ సదుపాయాన్ని అందించబోతోంది. చెన్నై యూనిఫైడ్ మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (కుంటా) నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతోపాటు, పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచేదిశగా కొచ్చిన్ నగరంలో ఫెర్రీ పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని నగరంలోనూ అలాంటి సదుపాయాన్ని నగరవాసులకు అందించాలని నిర్ణయించింది. ఆ ప్రకారం 'వాటర్ మెట్రో స్కీమ్' అమలు చేయనుంది. ఈ పథకం ప్రకారం మెరీనాబీచ్‌లోని నేపియర్ వంతెన నుంచి ఈస్ట్‌కోస్ట్ రోడ్డు వరకు సుమారు 53 కి.మీ.ల వరకు ఫెర్రీలతో జలప్రయాణం కలిగించనుంది. ఈ పథకానికి ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్ ఫెర్రీలను ఉపయోగించాలనే విషయంపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యం ఈ వాటర్ మెట్రో పథకం సాధ్యాసాధ్యాలపై నందనంలోని మెట్రో రైల్వే సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం జరుగనుంది. ఫెర్రీ నావిగేషన్ సామర్థ్యం, ప్రయాణమార్గంలో హాల్టింగ్ సెంటర్లు, పథకానికయ్యే ఖర్చులు, పర్యావరణ పరిస్థితులు తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చ జరుపనున్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఉన్నతాధికారులు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, మహానగర రవాణా సంస్థ అధికారులు, ఈ ప్రాజెక్టు అమలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. ఇదిఇలా ఉండగా మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టు పూర్తయితే నగరం రూపురేఖలు మారటం ఖాయమని, అదే సమయంలో వాటర్ మెట్రో స్కీమ్ అమలైతే రాజధాని నగరంలో ట్రాఫిక్ సమస్యలు 90 శాతం దాకా తగ్గే అవకాశాలున్నాయని మెట్రోరైల్వేస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

సీఎం స్టాలిన్ చేతులమీదుగా

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



కొళత్తూరు సభలో పలు పథకాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కిలాంబాక్కం కలైంజర్ శతజయంతి సంస్మరణ బస్ టెర్మినల్ వద్ద రూ.18.26 కోట్లతో నిర్మించిన మూడంతస్థుల పోలీసుస్టేషన్‌కు మంగళవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. కొళత్తూరులోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటైన సభలో ఆయన పాల్గొని పెరంబూరు మార్కెట్ వీధిలో ఉన్న కార్పొరేషన్ బాలికల మహోన్నత పాఠశాలలో సింగార చెన్నై 2.0, పథకం కింద, చెన్నై కార్పొరేషన్ ద్వారా విడుదలైన రూ.9.74 కోట్లతో నిర్మించిన అదనపు భవనాన్ని కూడా సీఎం ప్రారంభించారు. ఈ సభలోనే 14 కొత్త పథకాలకు కూడా శంకుస్థాపన చేశారు. సీఎండీఏ ఆధ్వర్యంలో కొళత్తూరులో రూ.11.37 కోట్లతో నిర్మించనున్న ఏసీపీ కార్యాలయం, పెరవళ్లూరు పోలీసుస్టేషన్, లా అండర్ ఆర్డర్ విభాగం, ట్రాఫిక్ విభాగం భవనాలకు, కొళత్తూరు రెట్టేరిలో రూ.1.62 కోట్లతో ఏసీ బస్‌స్టాప్‌కు శంకుస్థాపన చేశారు. కొళత్తూరు శ నియోజకవర్గంలో రూ.3.27కోట్లతో ఫిలింగ్టన్ రోడ్డులో కాలువకు ఇరువైపులా ప్రహరీగోడ నిర్మాణం, తదితర పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.39 కోట్లతో నిర్మించనున్న రెండు క్రీడా మైదానాలు, 9 ఉద్యానవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియా, శాసనసభ్యులు తాయగం కవి, వెట్రిఅళగన్, జోసెఫ్‌సామువేల్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, డీజీపీ శంకర్‌జివాల్, రాష్ట్ర గృహవసతి, నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ ఎ. అరుణ్, తాంబరం పోలీసు కమిషనర్ అబిన్ దినేష్ మేదక్, కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురుబరన్, సీఎండీఏ సీఈఓ ఎ.శివజ్ఞానం తదితరులు పాల్గొన్నారు.

రూ.20వేలు దాటితే

ఐటీకి సమాచారం

- రిజిస్ట్రేషన్ సమయంలో పరిమితికి మించి నగదు బట్వాడా జరగకుండా చర్యలు
- సబ్ రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశం

అడయార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ సందర్భంగా రూ.20 వేలకు మించి నగదు మార్పిడి జరిగితే ఆదాయపన్ను శాఖకు సమాచారం ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా 587 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాల్లో ప్రతి రోజూ వేల సంఖ్యలో ఆస్తుల రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు సాగుతున్నాయి. తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.150 నుంచి రూ.200 కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది. చెన్నై మహానగరంలో సైదాపేట, కుండ్రత్తూరు, తిరుప్పోరూర్, తాంబరం, సేలయూరు వంటి కొన్ని ముఖ్యమైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి రోజూ విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. కనీసం 20 వేల నుంచి 50 వేల మంది రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చిపోతున్నారు. ఇదిలావుంటే, గతంలో ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ అంశంలో వివాదం తలెత్తడంతో సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ డైరెక్టర్ దినేష్ పొన్‌రాజ్ ఆలివర్ రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఒక సర్క్యులర్ పంపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూ.20 వేలకు మించి నగదుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగే ప్రతి దరఖాస్తు వివరాలను ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఒక వేళ సమాచారం తెలియజేయక, ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేసే అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు.

21న మదురైలో టీవీకే మహానాడు

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఈ నెల 21న తమిళగ వెట్రి కళగవ (టీవీకే) రెండో మహానాడు భారీస్థాయిలో నిర్వహించనున్నారు. రెండో మహానాడును మదురైలో ఈ నెల 25న జరపాలని నిర్ణయించారు. అయితే 27వ తేదీ వినాయక చవితి కారణంగా మహానాడుకు పోలీస్ బందోబస్తు కల్పించడం కష్టమని మదురై పోలీసులు స్పష్టం చేయడంతో వారి సూచన మేరకు ఈ నెల 21న మహానాడు నిర్వహించనున్నట్లు టీవీకే నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పదేళ్ల అన్నాడీఎంకే పాలన

స్వర్ణయుగం

కుట్రాలం రోడ్‌షోలో ఎడప్పాడి పళనిస్వామి



ప్రత్యేక ప్రతిభావంతులతో సమావేశమైన మాజీ సీఎం ఈపీఎస్

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అన్నాడీఎంకే పాలన స్వర్ణయుగంగా రాష్ట్రప్రజలు ప్రశంసిస్తున్నారని తాను పర్యటించే ప్రాంతాలకు ప్రజలు భారీగా తరలివస్తున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో మంగళవారం తెన్‌కాశి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో ఈపీఎస్ పర్యటించారు. ఇందులో భాగంగా తెన్‌కాశి నియోజకవర్గంలో ప్రత్యేక ప్రతిభావంతులతో సమావేశమైన ఈపీఎస్ అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక ప్రతిభావంతులు 10వేల మందికి రూ.52కోట్లతో 3చక్రాల స్కూటర్లను పంపిణీ చేశామని, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ పెంచామని, రెండు లక్షల లబ్దిదారులకు రూ.330 కోట్లతో పలు రకాల సంక్షేమ సహాయాలు అందజేసినట్లు తెలిపారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమాన్ని విస్మరించడంతో పాటు వారికి గత అన్నాడీఎంకే కల్పించిన రాయితీలను నిలిపివేసిందన్నారు. మళ్ళీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని పథకాలు అందిస్తామని వారికి ఈపీఎస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్, ఎమ్మెల్యే ఇసైక్కి సుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే శరవణన్ సహా పలువురు పాల్గొన్నారు. అనంతరం తెన్‌కాశి సమీపంలోని కుట్రాలం జంక్షన్‌లో 4 గంటలకు రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడారు. దివంగత మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత బాటలో పార్టీని ముందుకు నడిపిస్తున్న తనకు కార్యకర్తల తో పాటు ప్రజా బలం కూడా పెరుగుతోందని, రాబోయే రోజులు తమకు ప్రకాశవంతంగా ఉంటాయన్నారు. తిరునల్వేలి ప్రజల చిరకాల కోరిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను ఏర్పాటు చేస్తామని, కొత్త జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి ఒకే ఏడాదిలో 11 ప్రభుత్వ వైద్య, విద్యా కళాశాలలను తీసుకొచ్చిన ఘనత తమదేనన్నారు. కార్పొరేట్ సంస్థలతో కుదుర్చుకున్న కొత్త పరిశ్రమల ఒప్పందంలో ఇప్పటివరకు ఏ స్థాయికి పెట్టుబడులు తెచ్చారు?, ఏఏ సంస్థలను ప్రారంభించారన్న వివరాలను ముఖ్యమంత్రి స్టాలిన్ సంబంధిత శాఖల మంత్రులు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈపీఎస్ అన్నారు.

14న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేది ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగనుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా, రాష్ట్రంలో ఏడో సారి అధికారం చేపట్టాలనే లక్ష్యంతో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం, కొత్త పథకాలు పరిచయం చేస్తోంది. అన్ని జిల్లాల్లో మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో, ఈ నెల 14న జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో, తదుపరి చేపట్టాల్సిన పథకాలు, పెట్టుబడులకు ఆమోదం తెలపడం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం.

కలైంజర్ విశ్వవిద్యాలయం బిల్లు ...

రాష్ట్రపతికి పంపించిన గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుంభకోణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, ఏప్రిల్‌లో కలైంజర్ విశ్వవిద్యాలయం బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ ఈ బిల్లు ప్రవేశపెట్టగా, విశ్వవిద్యాలయానికి సీఎం స్టాలిన్ ఛాన్సలర్‌గా, అసిస్టెంట్ ఛాన్సలర్‌గా ఉన్నత విద్యాశాఖ మంత్రిని నియమిస్తూ బిల్లు రూపొందించి గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. కానీ, గవర్నర్ బిల్లుపై సంతకం చేయలేదు. గవర్నర్ జాప్యం చేయడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు మంత్రి చెళియన్ ప్రకటించిన నేపథ్యంలో బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ పంపినట్లు వార్తలు వెలువడ్డాయి.

సర్వసభ్యమండలికి రండి

- సభ్యులకు రాందాస్ లేఖ

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీకి పూర్వ వైభవం కల్పించే దిశగా ఈ నెల 17న తన అధ్యక్షతన జరుగనున్న సర్వసభ్యమండలి సమావేశానికి సభ్యులందరూ తప్పకుండా హాజరుకావాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ లేఖ రాశారు. ఇదిలా ఉండగా రాందాస్ తనయుడు అన్బుమణి కూడా ఈ నెల 9న మహాబలిపురంలో సర్వసభ్యమండలి జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. రాందాస్ పాట్టనూరులో సర్వసభ్యమండలి సమావేశం జరుగుతుందని తన అధ్యక్షతన జరిగే సర్వసభ్యమండలి సమావేశానికే హాజరుకావాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి మీడియాతో మాట్లాడుతూ పార్టీలో సంక్షోభం త్వరలో ముగిసిపోతుందని, తండ్రీ తనయులు ఏకమవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీఎంకే బండారం బయటపెడతా

- బీజేపీ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ



చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలన్నీ డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్నట్లుగా స్టిక్కర్లు వేసుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, నటి ఖుష్బూ ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేసిన అవినీతి అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తానని, పాలకుల అసలు రంగు బయటపడుతుందన్నారు. మంగళవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం రైతులకు, విద్యార్థులకు, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి అర్హులకు చేరకముందే ఆ పథకాలకు డీఎంకే ప్రభుత్వ స్టిక్కర్లు, ప్రత్యేకించి స్టాలిన్ ఫొటోల స్టిక్కర్లు అతికించి, ఆ పథకాలన్నీ తమవిగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, బాలికలకు, యువతులకు, వృద్ధులకు భద్రతలేదని, అత్యాచారాలు, హత్యలు, నేరాలు రోజురోజుకూ అధికమవుతున్నాయే గానీ తగ్గటం లేదని ఖుష్బూ ఆరోపించారు.. హోం మంత్రిత్వ శాఖ నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా అచేతనంగా ఉంటూ తమ ప్రభుత్వం కోసం గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. త్వరలోనే ప్రజలంతా డీఎంకే పాలనకు చరమగీతం పాడనున్నారని ఖుష్బూ జోస్యం చెప్పారు.

సమాచార దర్శిని

తపాలా శాఖ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖపై క్విజ్ పోటీలు, తపాలా స్టాంపుల సేకరణ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తపాలా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విషయమై అన్నాసాలైలోని ప్రధాన తపాలా కార్యాలయ అధికారి నిహాలా కె.షరీఫ్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రానికి చెందిన 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు తపాలా శాఖపై క్విజ్ పోటీలు, తపాలా స్టాంపుల సేకరణపై పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈపోటీల్లో ఎంపికైన విద్యార్థులకు తమిళనాడు తపాలశాఖ ఏడాదికి రూ.6,000 ఉపకారవేతనం అందజేయనుంది. రీజియన్ వారీగా పోటీలు సెప్టెంబరు 20వ తేదీన నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన విద్యార్థులు www.tamilanadupost.cept.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని తపాలా శాఖ తెలిపింది.

11,12న కోవై, తిరుప్పూర్‌లో సీఎం పర్యటన

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 11,12 తేదీల్లో తిరుప్పూర్, కోయంబత్తూర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. గత నెల 21వ తేది అనారోగ్యం కారణంగా నగరంలోని ఓ ఆస్పత్రిలో సీఎం స్టాలిన్ చికిత్స పొందారు. అందువల్ల గత నెల 22,23 తేదీల్లో కోవై, తిరుప్పూర్ జిల్లాల్లో జరగాల్సిన సీఎం పర్యటన వాయిదాపడింది. ప్రస్తుతం సీఎం ఆరోగ్యం కుదుటపడి యధావిధిగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, తిరుప్పూర్ జిల్లా పల్లడం, ఉడుమలైపేట జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం కోవై జిల్లాలో పర్యటించనున్న సీఎం, కోవై 'మాస్టర్ ప్లాన్' తయారీకి సంబంధించి అధికారులతో సమావేశమవుతాయని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ అవకాశాలు, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో 132 ప్రభుత్వ, 311 ప్రైవేటు ఐటీఐలున్నాయి. ఈ కేంద్రాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల గడువు గత నెల 31వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, ఈ నెల 31వ తేది వరకు పొడిగించారు. ఈ కేంద్రాల్లో చేరే విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యా ఉపకారవేతనంగా నెలకు రూ.750 అందజేయనున్నారు. వివరాలకు 9499055642, 9499055618 (వాట్సాప్ నెంబరు) సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి పబ్లిక్ పరీక్షల ఒరిజినల్ మార్కుల జాబితా

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ నెల 7 నుంచి ఒరిజినల్ మార్కుల జాబితా అందించనున్నారు. విద్యార్థులు తాము చదివిన పాఠశాలలు, ప్రైవేటు విద్యార్థులు తాము పరీక్ష రాసిన కేంద్రాల్లో గురువారం నుంచి మార్కుల జాబితా పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల శాఖ తెలిపింది.

నగరాల్లో 30 శాతం పెరిగిన ఆవిన్ పాల విక్రయాలు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై సహా మెట్రో నగరాల్లో ఆవిన్ పాల విక్రయాలు 30 శాతం పెరిగాయని పాడి పరిశ్రమ శాఖ మంత్రి మనో తంగరాజ్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... గత ఏడాది రూ.25 కోట్ల మేర విక్రయాలు జరగగా, ఈ ఏడాది సమారు రూ.33 కోట్ల విక్రయాలు జరిగే అవకాశముందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆవిన్ పార్లర్లకు పాల ఉత్పత్తులు అందజేసేలా చర్యలు చేపట్టామన్నారు.

21 శాతం పెరిగిన నీలగిరి మేకల సంఖ్య

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీలగిరి మేకల సంఖ్య 21 శాతం పెరిగిందని అటవీ శాఖ తెలిపింది. అంతరించి పోతున్న జాతిగా ఉన్న నీలగిరి మేకల సంరక్షణకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, రాష్ట్రంలోని అడవుల్లో నీలగిరి మేకల లెక్కింపు గత ఏప్రిల్‌లో చేపట్టారు. ఆ నివేదిక ప్రకారం, రాష్ట్రంలో 1,303 నీలగిరి మేకలున్నట్లు తెలిసిందని అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం సెలవులు

● మూడ్రోజుల పాటు ప్రత్యేక కొండ రైలు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సెలవుల సందర్భంగా మూడు రోజులు ప్రత్యేక కొండ రైలు సేవలు అందించనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... కున్నూరు నుంచి ఊటీ వరకు 15,16,17 తేదీల్లో ప్రత్యేక రైలు సేవలుంటాయని తెలిపింది. ఐదు బోగీలతో నడపనున్న ప్రత్యేక రైలులో మొత్తం 210 సీట్లలో 80 సీట్లు ఫస్ట్ క్లాస్, 130 సీట్లు సెకండ్ క్లాస్ ఉంటాయన్నారు. కున్నూరు నుంచి ఉదయం 8.20 గంటలకు బయల్దేరే రైలు 9.40 గంటలకు ఊటీ చేరుకుంటుంది. ఊటీ నుంచి సాయంత్రం 4.,45 గంటలకు బయల్దేరి 5.55 గంటలకు కున్నూరు చేరుకుంటుంది. అలాగే, 15,16,17 తేదీల్లో ఉదయం 9.45, 11.30, మధ్యాహ్నం 3 గంటలకు ఊటీ నుంచి కెత్తికి ప్రత్యేక రైలు సేవలు అందుబాటులో ఉంటాయని దక్షిణ రైల్వే తెలిపింది.

కవిన్ పరువు హత్యకేసులో

సీబీసీఐడీకి హైకోర్టు మదురై బెంచ్ నోటీసు



కవిన్ (ఫైల్‌ఫొటో)- హైకోర్టు మదురై బెంచ్

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కవిన్ పరువు హత్య కేసు విచారణ నివేదికను ఎనిమిది వారాల్లో న్యాయస్థానంలో దాఖలు చేయాల్సిందిగా సీబీసీఐడీకి హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించింది. తూత్తుకుడి జిల్లా ఆర్ముగమంగళం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కవిన్ సెల్వగణేష్ గత నెల 27న తిరునల్వేలిలో హత్యకు గురైయ్యాడు. దళిత వర్గానికి చెందిన కవిన్ మరో కులానికి చెందిన యువతిని ప్రేమించినందున ఆమె సోదరుడు సుర్జిత్ ఈ హత్యకు పాల్పడినట్లు నిర్ధారించిన పోలీసులు అతడిని గూండా చట్టం కింద అరెస్టుచేసి జైలుకు తరలించారు. కవిన్ హత్యను పరువు హత్యగా భావించిన దళిత సంఘాలు, అన్నాడీఎంకే, డీఎండీకే తదితర రాజకీయ పార్టీలు మృతిడి కుటుంబానికి న్యాయం చేయాలని, ఇందులో సంబంధాలున్న సుర్జిత్ తల్లిదండ్రులైన ఎస్‌ఐలు శరవణన్-కృష్ణకుమారిలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో శరవణన్-కృష్ణకుమారి దంపతులపై హత్యకేసు నమోదు చేసి వారిని సస్పెండ్ చేసారు. ఈ నేపథ్యంలో, కవిన్ పరువు హత్యకేసుకు సంబంధించి తూత్తుకుడికి చెందిన గాంధీమతి న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్‌లో, ఈ కేసు విచారణ తిరునల్వేలి జిల్లా న్యాయమూర్తి పర్యవేక్షణలో జరగాలని, బాధితుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.50లక్షలు అందజేయాలని, ప్రేమ వ్యవహారంలో పరువు హత్యలు జరగకుండా అడ్డుకునేలా ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. మగళవారం ఉదయం ఈ పిటిషన్ హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తులు ఎస్‌ఎం.సుబ్రమణ్యం, మరియా గ్లాడ్ ధర్మాసనం ముందు విచారణకు రాగా, హాజరైన అడిషినల్ అడ్వకేట్ జనరల్ అజ్మల్‌ఖాన్ తన వాదనలో, కవిన్ హత్యకేసుపై సీబీసీఐడీ విచారణ జరుపుతుందని, మృతుడి కుటుంబానికి రూ.6లక్షలు నష్టపరిహారాన్ని అందజేశామని, త్వరలో మరో రూ.6లక్షలు నష్టపరిహారంగా అందజేయనున్నట్లు తెలిపారు. కేసు విచారణ పారదర్శకంగా సాగుతున్నందువల్ల మూడో వ్యక్తి ఈ కేసులో జోక్యం కలుగజేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కాగా, పిటిషనర్ తరుపున హాజరైన సీనియర్ న్యాయవాదులు బినేగాస్, అడ్విన్‌కుమార్‌లు తమ వాదనలో, రాష్ట్రంలో 2017 నుంచి 2024 వరకు 65 పరువు హత్య కేసులున్నాయని, ఇది మళ్ళీ పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాన్ని తెచ్చేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలన్నారు. ఇరు తరుపు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తుల బెంచ్ ఈ కేసు విచారణ నివేదికను 8 వారాల్లో దాఖలు చేయాలని, విచారణ ఏకపక్షంగా ఉండకూడదని సీబీసీఐడీ పోలీసులకు ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా పాళయంకోట సీఐ కాశిపాండియన్‌కు కూడా ఈ హత్యకేసులో సంబంధాలున్నాయని కవిన్ తండ్రి సెల్‌ఫోన్ ఆధారాలను న్యాయస్థానంలో సమర్పించారని, కాశిపాండియన్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది.

డీఎంకే వెంటే యువత

● మంత్రి ఎస్‌ఎం.నాజర్



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి నాజర్

తిరుత్తణి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డీఎంకేకు యువత మద్దతు ఎప్పుడూ ఉంటుందని, పార్టీ శ్రేణులు కూడా ఉత్సాహం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని మంత్రి నాజర్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో డీఎంకే యువజన విభాగం నిర్వాహకులకు సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమం జరిగింది. తిరుత్తణి నియోజకవర్గం పరిధిలోని 330వ బూత్‌కు సంబంధించిన బూత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎస్‌ఎం.నాజర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఒకప్పట్లో గ్రామగ్రామానికి వెళ్ళి కరపత్రాలిచ్చి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళామని, ప్రస్తుతం యువత చేతిలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉందని, యువత సోషల్ మీడియాలో ఎంతో చురుగ్గా ఉన్నారని, టెక్నాలజీతో అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. పెరుగుతున్న ఆధునిక టెక్నాలజీని దృష్టిలో ఉంచుకుని డీఎంకే యువజన, విద్యార్థి విభాగాల నాయకులకు వీటిపై అవగాహన కల్పించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతిపక్షాలు డీఎంకేపై చేసే విమర్శలను యువతే తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుత్తణి నగర డీఎంకే నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్ ముఠాల నుంచి రూ.18 కోట్ల స్వాధీనం

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇప్పటివరకు సైబర్ ముఠాల నుంచి రూ.18 కోట్లు స్వాధీనం చేసుకుని, బాధితులకు అందించినట్లు చెన్నై సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు చెన్నై పోలీసు శాఖ పలు చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, గత జూలైలోనే 191 ఫిర్యాదులపై చర్యలు చేపట్టి, రూ.1,65,30,234 స్వాధీనం చేసుకుని బాధితులకు అందించారు. అలాగే, ఈ ఏడాది ఇప్పటివరకు సైబర్ ముఠాల నుంచి రూ.18,08,61,565 స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేసినట్లు చెన్నై సైబర్ క్రైం పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

కుప్పంలో తమిళనాడు వాసి హత్య



రక్తపు మడుగులో రాము మృతదేహం

కుప్పం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భార్యను తనకు కాకుండా చేశాడన్న అక్కసుతో రాము (42) అనే తమిళనాడు వాసిని అదే రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ హత్య చేశాడు. చిత్తూరు జిల్లా కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన రాము, లక్ష్మీ భార్యాభర్తలు. వీరి కుమార్తెతో లక్ష్మీకి తమ్ముడి వరుసయ్యే అదే రాష్ట్రం కృష్ణగిరికి చెందిన రాజ్‌కుమార్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. లక్ష్మీ కుమార్తె భర్తతో గొడవపడి పిల్లలతో కలిసి కొంతకాలంగా పుట్టింట్లోనే ఉంటోంది. తన భార్యాపిల్లలు దూరం కావడానికి రామునే కారణమని భావించిన రాజ్‌కుమార్ అతనిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో రాముతో స్నేహపూర్వకంగా మెలుగుతూ మంగళవారం కుప్పం తీసుకొచ్చాడు. కుప్పం పట్టణం కమతమూరు రోడ్డులోని ఓ ఖాళీ లేఅవుట్‌లో ఇద్దరూ కలిసి మద్యం తాగారు. అనంతరం రాజ్‌కుమార్ తాగిన మత్తులో ఉన్న రాము తలపై బండరాయితో మోది హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి నిందితుడైన రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాము భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

17న బీజేపీ 'బూత్' కమిటీ మహానాడు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ కేంద్రం వారీగా 12 మందితో బూత్ కమిటీలు ఏర్పాటుచేసింది. ఈ క్రమంలో, దక్షిణ జిల్లాల్లో బీజేపీ బూత్ కమిటీ మహానాడు ఈ నెల 17న తిరునల్వేలి జిల్లాలో నిర్వహించనున్నారు. ఈ మహానాడు అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి, పార్టీ నేతలతో సమావేశమై ఎన్నికల ఏర్పాట్లపై వివరిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

280 పోలీస్‌స్టేషన్ల హోదా పెంపు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 280 పోలీస్ స్టేషన్ల హోదా పెంచారు. రాష్ట్ర పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్ హోదా కలిగిన 1,366 పోలీస్ స్టేషన్లు, ఎస్‌ఐ హోదా ఉన్న 424 పోలీసు స్టేషన్లున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 29న అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దుపై ప్రసంగించిన ముఖ్యమంత్రి స్టాలిన్, పోలీస్ స్టేషన్ల హోదా పెంచుతున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం ఎస్‌ఐలు ఉన్న 280 పోలీస్ స్టేషన్లను సీఐ హోదాకు పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తద్వారా శాంతి భద్రతల పర్యవేక్షణ, ఎఫ్ఐఆర్ నమోదు, కులవివక్షకు సంబంధించిన కేసుల విచారణ తదితరాలు చేపట్టవచ్చని తెలిపిన ప్రభుత్వం, హోదా పెంపుకు రూ.1.18 కోట్లు కేటాయించింది. హోదా పెంచిన స్టేషన్లకు త్వరలో సీఐలను నియమించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

భూ సేకరణ ఉపసంహరించుకోవాలి



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు

వేలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం మహిమండలం ప్రాంతంలో సిప్కాట్ ఏర్పాటుకు వ్యవసాయ భూములు సేకరించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం తమ భూముల్లో పండించిన వేరుశెనగ, కూరగాయలతో వంద మందికి పైగా గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ప్రజలు తెలిపారు.

పుదుక్కోటలో 260 సవర్ల నగల చోరీ

అడయార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుదుక్కోటలో రెండు ఇళ్లల్లో ప్రవేశించి 260 సవర్ల బంగారు నగలను చోరీచేశారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే సింగపూర్‌లో పనిచేస్తున్న పుదుక్కోట అన్నాసత్రంకు చెందిన కదిరేశన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల స్వదేశానికి వచ్చిన ఆయన తన భార్యాపిల్లలతో కలిసి మంగుళూరులో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్ళారు. ఆ దొంగలు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న వంద సవర్ల నగలతో పాటు కొంత నగదు చోరీ చేశారు. రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చిన కదిరేశన్... ఇంటో చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అలాగే, పుదుక్కోటలోని ఫాజిల్‌నగర్‌కు చెందిన మురుగేశన్ ఇంటిలో కూడా 160 సవర్ల బంగారు నగలు, రెండు సవర్ల డైమండ్ చైన్, రూ.30 వేల నగదు చోరీకి గురయ్యారు. మురుగేశన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రెడ్‌హిల్స్: ఈశ్వరన్ నగర్, పెరుమాళ్ నగర్, పమ్మాదుకుళం కాలనీ, ఇందిరా నగర్, సోలయమ్మన్ నగర్, గాంధీ నగర్

తిరుముల్లైవాయల్: పొండేశ్వరం, మాగరాల్, కొమక్కుంబేడు, కారణి, తామరైపాక్కం, కొడువెలి, వేళ్లచ్చేరి, కార్లపాక్కం, కాదవూర్, అరక్కంపాక్కం

పల్లావరం డివిజన్: కామాక్షి నగర్, దేవరాజ్ నగర్, పసుంపొన్ నగర్, బాలాజి నగర్ తిరునగర్, పద్మనాభ నగర్, లక్ష్మీ నగర్, ఎల్లార్ రాజమాణిక్యం రోడ్డు, అన్నాసాలై 7 నుంచి 15 వీధులు, సిగ్నల్ ఆఫీస్ రోడ్డు, గాంధీ రోడ్డు, కలైంజర్ రోడ్డు, సెన్‌తమిళ్ రోడ్డు, శ్రీనివాసన్ నగర్, తిరుమలై నగర్, ఆదాం నగర్ 1 నుంచి 9 వీధులు, శంకర్ నగర్ ఈస్ట్ మెయిన్ రోడ్డు, వెంకటేశ్వర నగర్ మెయిన్ రోడ్డు, ఎంజీఆర్ నగర్, కస్తూరిబాయ్ నగర్, భారతి నగర్, పొన్నురంగం నగర్, ఈసీటీవీ నగర్, చిత్తిరై నగర్, ఎంజీఆర్ వీధి, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, టీఎస్ లక్ష్మీనారాయణ నగర్, భజన ఆలయ వీధి

పొలిచలూర్: తిరు నగర్, పద్మనాభ నగర్, గనమణి నగర్, భవాని నగర్, పీసీఎస్ కాలని, రాజేశ్వరి నగర్, భజన ఆలయ వీధి, ప్రేమ్ నగర్, లక్ష్మీ నగర్, మూగాంబిగై నగర్, వినాయగ నగర్, షణ్మగ నగర్

అరిమా సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

వేలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి అరిమా సంఘం నూతన కార్యవర్గం పదవీ ప్రమాణం మంగళవారం జరిగింది. అరిమా సంఘం 18వ ఏడాది అధ్యక్షుడిగా రామన్, సెక్రటరీగా రాధాకృష్ణన్, కోశాధికారిగా సురేష్‌కుమార్, సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో యువరాజ్, పొన్నాంబలం సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణాలకు రూ.69 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 'ప్రధాన మంత్రి మాస్టర్ ప్లాన్' పథకంలో గిరిజనుల ఇళ్ల నిర్మాణాలకు రూ.69.28 కోట్లు కేటాయించారు. గిరిజనులు సొంత ఇళ్లు నిర్మించుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2023 డిసెంబరులో రాష్ట్రంలోని 21 జిల్లాల్లో ఈ పథకం ప్రారంభించారు. ఆ ప్రకారం, గిరిజన వర్గాలకు చెందిన ఇరుళర్, కాట్టునాయకర్, కోడా, కురుంబ, బనియా, తోడా వంటి వారు ఈ పథకంలో లబ్దిపొందేందుకు అర్హులు. ఈ పథకంలో ఇల్లు నిర్మించేందుకు రూ.2 లక్షలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, వివిధ ప్రాజెక్టుల నిధుల కింద, మైదాన ప్రాంతాల్లో ఒక ఇంటి ధర రూ. 5.07 లక్షలు, కొండ ప్రాంతాల్లో రూ.5.73 లక్షలుగా నిర్ణయించారు. 2023-24లో 4,811, 2024-25లో 10,168 ఇళ్ల నిర్మాణాలకు అనుమతించారు. ఆ ప్రకారం, కేంద్ర ప్రభుత్వం రూ.179.75 కోట్లు అందించాల్సి ఉండగా, తొలివిడతగా 2023-24లో రూ.13.48 కోట్లు, 2024-25లో రూ.41.57 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రూ.41.57 కోట్లు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.27.71 కోట్లు కేటాయిస్తూ జీవో విడుదల చేసిందని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ ఒక ప్రకటనలో తెలిపారు.

వేంబుమారియమ్మన్ శక్తి పీఠంలో ఆడి వేడుకలు



వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు డివిజన్ అత్తియూరు గ్రామంలో ఉన్న వేంబు మారియమ్మన్ పీఠంలో మంగళవారం ఆడి నెల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, మహా దీపారాధన నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. వేంబు స్వామి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా కార్పొరేషన్ కౌన్సిలర్ గంగ, చెంగానత్తమ్ భగవతి స్వామి, సిద్ధు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో బీఎడ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీఎడ్‌లో అడ్మిషన్లు ఈ ఏడాది తొలిసారిగా ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. ఈ విషయమై ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విడుదల చేసిన ప్రకటనలో... గత ఏడాది వరకు బీఎడ్ కోర్సుల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రత్యక్షంగా చేపట్టారు. దీంతో పొరుగుజిల్లాల విద్యార్థులు చెన్నై రావాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో, పొరుగు ప్రాంతాల విద్యార్థులు సౌకర్యార్థం, ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనలతో, ఈ ఏడాది బీఎడ్ కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ద్వారా చేపట్టామని తెలిపారు. సోమవారం ప్రారంభమైన కౌన్సెలింగ్ ఈనెల 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. బీఎడ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొని, కళాశాలను ఎంపిక చేసుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో 2,040 సీట్లకు 3,545 మంది దరఖాస్తు చేసుకున్నారని మంత్రి చెళియన్ తెలిపారు.

ముస్లిం మహిళా సంఘాల్లో సభ్యత్వాలకు ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా ముస్లిం మహిళల సహాయ సంఘాల్లో చేరేందుకు ఈ నెల 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్ధ్ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై జిల్లాకు చెందిన ముస్లిం కుటుంబాల్లో భర్త వదిలేసిన మహిళలు, వృద్ధులు స్వయం వృత్తులు ప్రారంభించేందుకు అవసరమైన శిక్షణ అందించేలా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో 'చెన్నై జిల్లా ముస్లిం మహిళల సహాయ సంఘం' పనిచేస్తుందని, ఈ సంఘ గౌరవ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, సభ్యులుగా ముస్లిం వర్గాలకు చెందిన ఆరుగురు మహిళలను నియమించాలని తెలిపారు. ఈ సంఘంలో సభ్యులుగా చేరేందుకు ఆసక్తి ఉన్న చెన్నై జిల్లాకు చెందిన ముస్లిం మహిళలు రాజాజీ రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

హోంగార్డులుగా హిజ్రాలు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు విభాగంలో చేరేందుకు 64 మంది హిజ్రాలు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'సమ్మిళిత సమాజం' అనే కార్యక్రమంలో భాగంగా, హిజ్రాలను హోంగార్డులుగా ఎంపిక చేయనున్నారు. వారికి తగిన శిక్షణ ఇచ్చి, ట్రాఫిక్ నియంత్రణ, అధిక రద్దీ కలిగి ప్రాంతాల్లో రక్షణ, సహాయ పనుల్లో వినియోగించనున్నారు.



వేలూరు జిల్లా ఏఎస్పీగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ధనుష్ కుమార్

● సాత్తాన్‌కుళం లాకప్‌డెత్ కేసు..

సీఐ శ్రీధర్ అప్రూవర్ పిటిషన్ తిరస్కరణ



సీఐ శ్రీధర్ (ఫైల్‌ఫొటో)

టి.నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సాత్తాన్‌కుళంలో జయరాజ్, ఫెనిక్స్ అనే తండ్రి కొడుకుల లాకప్‌డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ శ్రీధర్ అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను మదురై జిల్లా ప్రథమశ్రేణి జిల్లా అదనపు న్యాయస్థానం తోసిపుచ్చింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో సెల్‌ఫోన్ దుకాణాన్ని ప్రభుత్వం నిర్దేశించిన సమయం దాటి తెరచి ఉంచారనే ఆరోపణపై జయరాజ్, ఫెనిక్స్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్ళి చిత్రహింసలు పెట్టి హతమార్చారు. ఈ లాకప్‌డెత్ కేసుకు సంబంధించి సీఐ శ్రీధర్ సహా 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు సీబీఐ దర్యాప్తు జరుపుతోంది. ఈ నేపథ్యంలో మదురై జిల్లా ప్రథమశ్రేణి జిల్లా అదనపు న్యాయస్థానంలో సాక్షి (అప్రూవర్)గా మారేందుకు అనుమతించాలని కోరుతూ శ్రీధర్ తరపున పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిగినప్పుడు జయరాజ్ భార్య సెల్వరాణి తరపు న్యాయవాదులు, సీబీఐ తరపు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. లాకప్‌డెత్ జరగటానికి ప్రధాన కారకుడు సీఐ శ్రీధర్ అని, ఆయనను అప్రూవర్‌గా మార్చితే కేసును తప్పుదోవపట్టిస్తారని, విచారణ మరింత ఆలస్యమవుతుందని వాదించారు. ఈ కేసుకు సంబంధించి ముఖ్యమైన సాక్షులుగా ఉన్న నలుగురు వాంగ్మూలం ఇచ్చారని, ఆ సాక్ష్యాధారాలే కేసుకు బలం చేకూర్చే విధంగా ఉన్నప్పుడు శ్రీధర్ సాక్ష్యాధారం అనవసరమని సెల్వరాణి, సీబీఐ తరపు న్యాయవాదుల వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. శ్రీధర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

విమానాల ఆలస్యం


● ప్రయాణికుల ఆగ్రహం

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని జాతీయ విమానాశ్రయంలో తూత్తుకుడి, ఢిల్లీ విమానాలు ఆలస్యంగా బయలుదేరటంతో ప్రయాణికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వేకుజాము 3 గంటలకు ఢిల్లీకి బయలుదేరాల్సిన విమానం ఉదయం 6.25 గంటలకు బయలుదేరింది. ఇదే విధంగా ఉదయం 10 గంటలకు తూత్తుకుడి వెళ్ళాల్సిన విమానం మధ్యాహ్నం 1.35 గంటలకు బయలుదేరింది. దీంతో ఆ రెండు విమానాల్లో బయలుదేరాల్సిన ప్రయాణికులు ఆయా విమానయాన సంస్థల సిబ్బంది, విమానాశ్రయ అధికారులపై మండిపడ్డారు. ఇదే విధంగా మధ్యాహ్నం తూత్తుకుడి నుండి 1.45 గంటలకు రావాల్సిన విమానం కూడా ఆలస్యంగా వచ్చింది. మారిషష్ నుండి వేకువజాము 1.50 గంటలకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాల్సిన విమానం ఉదయం 7.50 గంటలకు చేరింది. వేకువజాము 3.35 గంటలకు ఆ విమానంలో మారిషష్ వెళ్ళాల్సిన ప్రయాణికులు సైతం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విమానాలలో ప్రయాణించాల్సిన వారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

మెడికో ఆత్మహత్య

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్ ప్రభుత్వ వైద్యకళాశాలలో చదువుతున్న విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తిరువళ్లూరుకు చెందిన దివ్య అనే విద్యార్థిని ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. టీపీ సత్రం ప్రాంతంలో అద్దెగదిలో ఉంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజాము ఆమె తనగదిలో ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు ఆ గది నుండి ఎలాంటి అలికిడి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. ఇదిలా ఉండగా దివ్య పనిభారం అధికం కావటం వల్లే ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఆమె తండ్రి అనుమానం వ్యక్తం చేయగా, ఆ దిశగా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

ఐదో రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల దీక్ష



చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 5, 6 జోన్లకు చెందిన పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరాహార దీక్ష మంగళవారం ఐదో రోజుకు చేరింది. కార్పొరేషన్ అధికారులు ఆ రెండు జోన్లలో పారిశుధ్య నిర్వహణ పనులను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఈ విషయమై కార్మికులు మాట్లాడుతూ తమను ప్రైవేటు సంస్థలో విలీనం చేయడం వల్ల జీతాలు తగ్గుతాయని, పింఛన్ కూడా తక్కువగా వచ్చి నష్టపోతామని తెలిపారు. ఇదిలా ఉండగా పారిశుధ్య కార్మికుల ఆందోళన కారణంగా ప్రస్తుతం 5, 6 జోన్ల పరిధిలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. వీటిని తొలగించేందుకు ఎవరూ రాకపోవడంతో వీధులు దుర్వాసన వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హత్య కేసులో నలుగురికి రెండు జీవిత ఖైదులు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని హతమార్చిన కేసులో నలుగురికి రెండు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తట్టార్‌మఠం ఇడచ్చివిలై ప్రాంతానికి చెందిన మయిలయ్య కుమారులు మురుగేశన్ (35), వయన్‌పెరుమాళ్ (48), ఆదిలింగరాజన్ (27) గత 2001 జూన్ 3వ తేది పాతకక్షల కారణంగా హత్యకు గురయ్యారు. ఈ కేసులో అదే ప్రాంతానికి చెందిన పీటర్‌జేసుమరియాన్ (64), ఆయన కుమారుడు సుధాకర్ (51), సిలువైపిచ్చయ్య కుమారులు అంతోనిరాజ్ (72), సెల్వరాజ్ (71) తదితరులను తట్టార్‌మఠం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ తూత్తుకుడి జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో జరుగుతోంది. ఈ కేసులో నేరారోపణ రుజువుకావడంతో, నిందితులు పీటర్ జేసుమరియన్, సుధాకర్, అంతోనిరాజ్, సెల్వరాజ్‌లకు తలా రెండు జీవిత ఖైదు శిక్షలు, రూ.20వేల జరిమానా, తలా మరో మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తాండవన్ సోమవారం తీర్పు వెలువరించారు.

గుంతలమయమైన రోడ్లు

● అన్నాడీఎంకే కార్పొరేటర్ వినూత్న నిరసన



రోడ్డుపై అంగ ప్రదక్షిణలు చేస్తూ నిరసన తెలుపుతున్న లోకనాథన్

వేలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కార్పొరేషన్ 49వ వార్డు తొరప్పాడిలో రోడ్లు గుంతలమయం కావడంతో పాటు మురిగుకాల్వల సౌకర్యం లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ప్రజలు పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, 49వవార్డు కార్పొరేటర్, అన్నాడీఎంకేకు చెందిన లోకనాథన్ వినూత్నంగా బురదమయమైన రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. ఇక్కడ ఆసుపత్రులు, పాఠశాలలు, ఆలయాలు ఉన్నాయని, ఈ వార్డులో అన్నాడీఎంకే గెలవడంతో అధికార డీఎంకే పాలక పక్షం చిన్నచూపు చూపుతోందని ఆయన ఆరోపించారు. సమస్య పరిష్కరించని పక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

యువ క్రీడాకారులకు ప్రోత్సాహం

● హెచ్‌సీఎల్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ నిధి బంధిర్ ప్రకటన


హెచ్‌సీఎల్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ నిధి బంధీర్

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొని దేశానికి ఘనత చేకూర్చేలా యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు హిందూస్థాన్ కంప్యూటర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్) ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ నిధి బంధిర్ పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ నిర్వహణలో నేషనల్ స్పోర్ట్స్ ఫైనల్స్-2025 ఏడో ఎడిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నగరంలోని శివసుబ్రహ్మణ్య నాడర్ కళాశాలలో మంగళవారం జరిగింది. సంస్థ డైరెక్టర్ డాక్టర్ నిధి బంధిర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పద్మశ్రీ ఆచంట శరత్‌కమల్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా రంగానికి హెచ్‌సీఎల్ నిర్వహణలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ నిధి బంధిర్ మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో 12,256 మంది యువ అథ్లెట్లను ఒకే చోట చేర్చి జిల్లా, రాష్ట్ర, జోనల్ స్థాయిలో శిక్షణా శిబిరాలు, బహుళస్థాయి అర్హత పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సహా 5 రాష్ట్రాల సమైక్యకు 131 బాస్కెట్ బాల్ వీల్‌చైర్లను పంపిణీ చేయడం ద్వారా క్రీడలను ప్రోత్సహించడంలో రికార్డు నెలకొల్పినట్లు ఆమె తెలిపారు.

ఘనంగా కలశలింగం వర్సిటీ స్నాతకోత్సవం


విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న విద్యావేత్తలు

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్‌లో వున్న కలశలింగం విశ్వవిద్యాలయం 38వ స్నాతకోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. ఛాన్సలర్ డాక్టర్ కె.శ్రీధరన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొ ఛాన్సలర్ డాక్రట్ ఎస్.అరివాళగి శ్రీధరన్, డాక్టర్ ఎస్.శశి ఆనంద్, ఎస్.అర్జున్ కలశలింగం, ఎస్.నారాయణన్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.వాసుదేవన్, కార్యనిర్వాహక మండలి సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా గత ఏడాది వర్శిటీ సాధించిన ర్యాంకులు, విద్యార్థుల విజయాలు, ప్రొఫెసర్ల పరిశోధనాభివృద్ధిని వైస్ ఛాన్సలర్ వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్ టెక్నాలజీస్ గ్లోబల్ టాలెంట్ హెడ్ ఆర్‌కే రామచంద్రన్ 3,552 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన టెక్ మాంగో సీఈవో ఎస్‌కే జయశ్రీ 128 మంది ర్యాంక్ హోల్డర్లకు పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ముఖ్య అతిథి మాట్లాడుతూ.. 2030 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిని భారతదేశం నిర్ణయిస్తుందని, వ్యవసాయ సాఫ్ట్‌వేర్‌తో సహా అన్ని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ మన దేశంలో ఉత్పత్తి అవుతాయన్నారు. విద్యార్థులు తమపై తాము సంపాదించిన విద్యాజ్ఞానంపై నమ్మకం ఉంచుకోవాలని సూచించారు.

నవంబరు నుంచి వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య రైళ్లు

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో వాహనాల రద్దీ నియంత్రించేందుకు సబర్బన్, మెట్రో, చెన్నై మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎమ్మార్టీఎస్) రైళ్ల సేవలు అందుబాటులో ఉన్నాయి. చెన్నై బీచ్-వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య 1985వ సంవత్సరంలో ఎమ్మార్టీఎస్ రైలు మార్గం పనులు ప్రారంభించి తొలి విడతగా 1997లో బీచ్ నుంచి మైలాపూర్ వరకు రూ.266 కోట్లతో 9 కిలోమీటర్ల మార్గం నిర్మించారు.. రెండో విడతగా రూ.877.59 కోట్లతో మైలాపూర్ నుంచి వేళచ్చేరి వరకు చేపట్టిన రైలు మార్గం నిర్మాణం పనులు 2007లో పూర్తికావడంతో ఆ మార్గంలో రైళ్ల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆ తర్వాత 2008లో సెయింట్ థామస్


వేళచ్చేరి రైల్వేస్టేషన్

మౌంట్-వేళచ్చేరి మధ్య 5 కిలోమీటర్ల వరకు రైలు మార్గం పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, ఆలంబాక్కం, తిల్లైగంగానగర్ ప్రాంతాల్లో స్థల సేకరణను వ్యతిరేకిస్తూ న్యాయస్థానంలో ప్రజాహిత వాజ్యం దాఖలు కావడంతో 2010 వరకు ఈ పనులు నిలిపివేశారు. ఆ తర్వాత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు స్థలసేకరణ పనులను అధికారులు వేగవంతం చేశారు. ప్రస్తుతం ఎమ్మార్టీఎస్ రైలు ఫ్లైఓవర్ నిర్మాణం పనులు 98 శాతం వరకు పూర్తికావడంతో నవంబర్ నుంచి వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మార్గాల్లో ఎమ్మార్టీఎస్ రైలు సేవలను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. వేళచ్చేరి ఎమ్మార్టీఎస్ మెట్రోరైలు సేవలతో విలీనం చేసే పథకానికి రైల్వేబోర్డు అనుమతించింది. అందువల్ల బీచ్-సెయింట్ థామస్ మౌంట్ మార్గంలో వచ్చే డిసెంబర్ మెట్రోరైలు నడపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

● ఎస్సీ ఎస్టీలపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారం..

ఢిల్లీలో నటి మీరా మిథున్ అరెస్టు



టి.నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ వర్గాలను కించపరిచేలా విమర్శలు చేసి సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేసిన కేసులో మూడేళ్లుగా పరారీలో ఉన్న సినీనటి, మోడల్ మీరామిథున్ అరెస్టయ్యారు. మీరామిథున్ వ్యాఖ్యలను ఖండిస్తూ పలు సంస్థలు ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో చెన్నై క్రైం పోలీసులు ఏడు సెక్షన్ల కింద మీరా మిథున్, ఆమె బాయ్‌ఫ్రెండ్ శ్యామ్ అభిషేక్‌పై కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత వారిని 2021 ఆగస్టులో అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ చెన్నై జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో జరుగుతోంది. ఆ కేసు విచారణకు పలుమార్లు మీరామిథున్ గైర్హాజరయ్యారు. దీంతో మీరా మిథున్‌కు వ్యతిరేకంగా నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఆ వారెంట్ జారీ అయి మూడేళ్లు దాటినా పోలీసులు ఆమె ఆచూకీ తెలుసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో అరెస్టు వారెంట్‌ను అమలు చేయని పోలీసులపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో మీరామిథున్ ఢిల్లీలో ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు ఆగమేఘాలపై అక్కడికి చేరుకున్నారు. ఢిల్లీ పోలీసుల సహాయంతో ఆమె ఆచూకీ తెలుసుకుని అరెస్టు చేశారు. ఆ తరువాత ఆమెను ఢిల్లీ సంరంక్షణ కేంద్రంలో ఉంచారు. ఈ నెల 11న ఆమెను నగరానికి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచేందుకు క్రైం విభాగం పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

9న వీఐటీలో జాబ్ మేళా

● ఛాన్సలర్ విశ్వనాథన్



వేలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ విశ్వవిద్యాలయంలో విప్రో సంస్థ తరఫున ఈ నెల 9వ తేది జాబ్ మేళా జరుగనుందని వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు. ఈ మేరకు వర్సిటీ విడుదల చేసిన ప్రకటనలో... వీఐటీ పీఆర్పీ భవనంలో ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందన్నారు. 2024, 2025 సంవత్సరాల్లో డిప్లొమో పూర్తిచేసినవారు, టెన్త్, ప్లస్ టూ, డిప్లొమో కోర్సుల్లో 50 శాతం మార్కులు సాధించిన వారు పాల్గొనవచ్చు. డిప్లొమో కంప్యూటర్ సైన్స్, ఐటీ, టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, మొబైల్ ఇండస్ట్రీస్ పూర్తిచేసిన వారు శిబిరంలో పాల్గొనవచ్చు. ఓపెన్ యూనివర్శిటీలో ప్లస్ టూ చదివిన వారు కూడా పాల్గొనవచ్చు. ఆసక్తి, అర్హత కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, చిరునామా, కుల, ఆదాయ ధ్రువ పత్రాలు అసలు, జెరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో శిబిరంలో పాల్గొనాలని, శిబిరంలో పాల్గొనేందుకు ఎలాంటి ఫీజు వసూలుచేయడం లేదని ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు.

తిరుప్పరంకుండ్రం ఆలయంలో దుర్గాస్టాలిన్ పూజలు

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్ సోమవారం సాయంత్రం తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యస్వామివారిని దర్శించారు. ఆ సందర్భంగా ఆలయం వద్ద ట్రస్టుబోర్డు అధ్యక్షులు సత్య ప్రియా, ఆలయ డిప్యూటీ కమిషనర్ సూర్యనారాయణన్, ఆలయ స్థానిక భట్టార్లు ఆమెకు ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామివారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు అరగంట సేపు ఆలయంలోనే గడిపిన ఆమె ఆ తరువాత చెన్నై బయలుదేరారు.

మురుగన్ ఆలయానికి వెళ్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ తదితరులు





రూ.6.60కోట్లతో పాఠశాల భవనం ప్రారంభం

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరు నియోజకవర్గం పరిధిలో రూ.6.60 కోట్లతో నిర్మించిన పాఠశాల అదనపు భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. అడయార్‌జోన్ రాజా అన్నామలైపురం నారాయణసామి గార్డెన్ వద్ద గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మాధ్యమిక పాఠశాలలోని అదనపు భవనంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు కూడా ఉన్నాయి. సింగార చెన్నై 2.0 పథకం కింద ఈ రెండంతస్థుల భవనాన్ని నిర్మించినట్లు ఉదయనిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, మేయర్ ఆర్ ప్రియా, మైలాపూరు శాసనసభ్యుడు డి. వేలు, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజా అన్నామలైపురం స్కూలులో అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

4న తిరూర్ కన్యకా పరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన సెవ్వాపేట సమీపంలోని తిరూర్ కన్యకా పరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం సెప్టెంబర్ 4న నిర్వహించనున్నారు. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ గ్రేటర్ చెన్నై చైర్మన్ కె.కె.త్రినాథ్ కుమార్ అధ్యక్షతన అన్నానగర్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కుంభాభిషేక ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్తిక్ టిఫిన్ సెంటర్ అధినేత డాక్టర్ డి.రవిచంద్రన్, అజంతా గ్రూప్ అధినేత డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమరవేల్, ఎన్ఏవీసీ అధ్యక్షుడు రవికుమార్, ఆలయ కన్వీనర్ చీమకుర్తి గోవిందరాజులు, డి.పుష్పాంబ వాసుదేవన్, ఎన్.బద్రినాథ్, అపోలో సుబ్రమణ్యం, సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి, బయ్యా బాలాజీ, స్వర్ణ సతీష్, అవినాష్ పేరూరు, ఎస్వీ పద్మనాభన్‌లతో పాటు సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ ఆలయ ప్రాంగణంలో నూతనంగా సత్యనారాయణస్వామి, దుర్గాదేవి, కాలభైరవుడు, వినాయకుడు, నవగ్రహాలు, పరివార దేవతలు, అయ్యప్ప, శివుడు, బాలాజీ, మురుగన్, దేశంలోనే మొట్టమొదటి సారిగా నవపాషాణంతో కళాత్మకంగా రూపొందించిన ఆనంద కృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సన్నిధులను ఏర్పాటు చేస్తున్నట్లు త్రినాథ్‌కుమార్ తెలిపారు.


కుంభాభిషేక ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ సభలో త్రినాథ్‌కుమార్, అతిథులు

చిత్రజ్యోతి

భార్య, ప్రియురాలు ఒకే ఇంటిలో ఉంటే...


'లవ్ రిటర్న్స్'లో చైత్రరెడ్డి, ఫర్వీన్, గురు లక్ష్మణ్

ప్రముఖ ఆడియో కంపెనీ సరిగమ యూట్యూబ్ మినీ సిరీస్ నిర్మాణంలోకి అడుగుపెట్టి, తొలిసారిగా 'లవ్ రిటర్న్స్' పేరుతో ఈ లఘు చిత్ర సిరీస్ నిర్మించింది. మొత్తం 12 ఎపిసోడ్లుగా రూపొందించిన ఈ మినీ సిరీస్‌లో బుల్లితెర సీరియల్ ఫేం చైత్ర రెడ్డి, 'కన కానుమ్ కాలంగల్-2' ఫేం ఫర్వీన్, 'ఆఫీస్' సీరియల్‌లో హీరోగా నటించిన గురు లక్ష్మణ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల 7వ తేదీ నుంచి నుంచి ప్రసారమయ్యే ఈ షార్ట్ సిరీస్‌ను సరిగమ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రిన్స్ ఇమ్మాన్యుయేల్ నిర్మించారు. సదాశివం సెంథిల్‌రాజన్, అర్జున్ డీవీ అనే ఇద్దరు దర్శకత్వం వహించారు. ఈ కథను దర్శక ద్వయం వివరిస్తూ, 'ఒకే ఇంటిలో భార్య, మాజీ ప్రియురాలు ఉండగా, ఆ సమయంలో ఆఫీస్ స్నేహితులు ఇంటికి వస్తే ఏం జరుగుతుంది. భార్య, ప్రియురాలి మధ్య చిక్కుకున్న భర్త పరిస్థితి ఎలా ఉంటుంది? వంటి అంశాలను ఆసక్తికరంగా తెరకెక్కించాం' అని వివరించారు.

విమల్ - సంగీత ప్రధాన పాత్రల్లో 'వడం'


పూజా కార్యక్రమంలో విమల్ - సంగీత

ప్రముఖ హీరో విమల్, హీరోయిన్ సంగీత జంటగా 'వడం' పేరుతో కొత్త చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం కోయంబత్తూరులోని మాసాని అమ్మన్ ఆలయంలో జరిగింది. ఈ సందర్భంగా చిత్ర బృందం 1500 మందికి అన్నదానం చేశారు. తమిళ సంప్రదాయం, సంస్కృతిలోని ముఖ్యమైన అంశాల్లో ఒకటైన వడ మంజు అనే వీరోచిత క్రీడా నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తమిళ సినిమాలో ఇప్పటి వరకు జల్లికట్టు, రేక్లా పోటీల నేపథ్యంలో పలు చిత్రాలు వచ్చాయి. కానీ, మంజు విరట్టు క్రీడాధారంగా ఒక సినిమా రూపొందించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రేమ, స్నేహం, కుటుంబం, హాస్యం ఇలా అన్ని అంశాల మేళవింపుతో కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నారు. ఇతర పాత్రల్లో బాలశరవణన్, నరేన్, రాందాస్ నటిస్తున్నారు. మాసాని పిక్చర్స్ పతాకంపై ఆర్.రాజశేఖర్ నిర్మించే ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం వి.కేంద్రన్. మదురై, పొల్లాచ్చి, కారైక్కుడి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపనుండగా, ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

గ్రామ పెద్ద పాత్రలో హెచ్.రాజా


'కందన్ మలై'లో హెచ్.రాజా తదితరులు

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ రాజకీయ నేత హెచ్.రాజా గ్రామ పెద్ద పాత్రలో 'కందన్ మలై' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. 'గిడుగు' ఫేం వీరమురుగన్ దర్శకుడు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'తిరుప్పరంకుండ్రం కొండ చుట్టూ జరిగే కథ. వాస్తవ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్నాం. ఇందులో హెచ్.రాజా కందన్ మలై ప్రాంతంలోని గ్రామ పెద్ద పాత్రను పోషిస్తున్నారు. 'నాయకన్' చిత్రంలోని కమల్ హాసన్ పాత్రలాగే, అతడి పాత్ర ఇందులో ఉంటుంది. ఆ అభిప్రాయాన్ని వ్యక్తీకరించడానికి ఒక సెలెబ్రిటీ అవసరం కావడంతో హెచ్.రాజాను ఆ పాత్రకు ఎంపిక చేయడం జరిగింది. నిజానికి ఈ పాత్ర కోసం అనేక మంది నటులను సంప్రదించాం. కానీ, ఎవరూ ముందుకు రాకపోవడంతో హెచ్.రాజాను తీసుకునానం. నిజానికి ఈ అవకాశం ఇచ్చింది కూడా ఆయనే. రాజకీయ నాయకుడుగానేకాకుండా నటుడిగా ఈ చిత్రంలో నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది' అని పేర్కొన్నారు.

విజన్ సెంటర్ ప్రారంభం


విజన్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎస్.ధోనీ

అడయార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్‌కు చెందిన విజన్ సెంటర్‌ను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తాజాగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాస్పిటల్ గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్‌కే వేలు, కో చైర్మన్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి, హాస్పిటల్ క్లినికల్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.గణేష్, క్లినికల్ డైరెక్టర్ (తమిళనాడు) డాక్టర్ శిబు వర్గీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వేలు మాట్లాడుతూ, రూ.100 కోట్లతో ప్రారంభమైన తమ హాస్పిటల్ నెట్‌వర్క్‌ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. ఇప్పటికే తిరుచ్చి, మదురై, సేలం, తంజావూరు, కుంభకోణం, పెరంబలూరులో తమ ఆస్పత్రులున్నాయన్నారు. చెన్నై నగర వ్యాప్తంగా 10 సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్, విజన్ సెంటర్లను ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

నగరంలో ప్రారంభమైన 'హాయ్ లైఫ్' ప్రదర్శన


ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో హాయ్ లైఫ్ ఆధ్వర్యంలో అతిపెద్ద లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో 150కి పైగా ట్రెండ్ సెట్టింగ్ డిజైనర్లు, లగ్జరీ లేబుల్స్ అన్నీ ఒకే గొడుగు కింద ప్రదర్శనకు ఉంచారు. తేనాంపేటలోని నక్షత్ర హోటల్‌లో ఈ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను హాయ్ లైఫ్ ప్రారంభించింది. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది. ఈ ప్రదర్శనపై హాయ్ లైఫ్ ఎండీ, సీఈవో అబిడొమినిక్ మాట్లాడుతూ, 'చెన్నైతో ఎల్లప్పుడూ గొప్ప అనుబంధం ఉందన్నారు. ఈ ఎడిషన్ దేశం అంతటా డిజైనర్ వేర్, జ్యూవెలరీ, వెడ్డింగ్ ఫ్యాషన్, లగ్జరీ డెర్, గృహోపకరణాలతో పాటు ట్రెండ్ సెట్టింగ్ సామగ్రి అందుబాటులో ఉందన్నారు.

9న తాంబరంలో ప్రభుత్వాస్పత్రి ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలో ప్రభుత్వాస్పత్రి భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 9వ తేది ప్రారంభించనున్నట్లు ప్రజాపనుల శాఖ మంత్రి ఏవీ వేలు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆస్పత్రులు లేని 24 జిల్లాల్లో కొత్త ఆస్పత్రులు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, జయంకొండాం, తాంబరం, పళని సహా 19 ప్రభుత్వాసుపత్రులను జిల్లా ప్రధాన ఆసుపత్రులుగా హోదా పెంచుతున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం గత శాసనసభ సమావేశాల్లో ప్రకటించారు. ఆ ప్రకారం, తాంబరం ప్రభుత్వాస్పత్రిని చెంగల్పట్టు జిల్లా ప్రధాన ఆస్పత్రిగా హోదా పెంచి, తాంబరం శానిటోరియం బస్టాండ్ సమీపంలో రూ.115.38 కోట్లతో కొత్త భవనాలు నిర్మించారు. రూ.5.38 కోట్లతో కొనుగోలు చేసిన అధునాతన వైద్య పరికరాలు ప్రస్తుతం అమర్చుతున్నారు. ఆరు అంతస్తులతో నిర్మించిన ఈ కొత్త ఆసుపత్రిలో, 400 పడకలు, 6 ఆపరేషన్ థియేటర్లు, 40 పడకల ఐసీయూ సహా పలు ప్రత్యేక అంశాలున్నాయి. అలాగే, క్రోంపేటలో ఉన్న పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రూ.7.10 కోట్లతో దంత వైద్యశాల, రూ. కోటితో అధునాతన ల్యాబోరేటరి ఏర్పాటుచేశారు. ఈ మూడు వైద్య భవనాలను ఈ నెల 9వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని మంత్రి ఏవీ వేలు తెలిపారు.

తిరుత్తణి మురుగన్ సేవలో ప్రేమలత


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

తిరుత్తణి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో మురుగన్ ఆలయాన్ని మంగళవారం ఉదయం డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడి మంగళవారం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చారు. అనంతరం వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రతిఏటా తిరుత్తణి వచ్చి, స్వామివారిని దర్శించుకుంటానని, ఆ దేవదేవుడి కృపతో రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలకు తమిళనాడులో ఓటు హక్కు కల్పించడం అన్యాయమని, దీనిని డీఎండీకే ఖండిస్తుందన్నారు. ప్రభుత్వం ఓటర్ల జాబితాను మరోసారి రీ వెరిఫికేషన్ చేసి తుది జాబితా నిర్ధారించాలన్నారు. అనంతరం అర్చకులు, ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ సురేష్‌బాబు తదితరులు ప్రేమలతను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోశాధికారి ఎల్‌కే.సుతీష్, యువజన విభాగం కార్యదర్శి ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ తెలిపింది. ఆ ప్రకారం, తిరువొత్తియూర్ మండలం 6వ వార్డు రాజా షణ్ముగ నగర్ 4వ వీధిలో ఉన్న కమ్యూనిటీ హాలు, మాధవరం మండలం 33వ వార్డు భారతీయార్ వీధి ఏళుమలై నాయకర్ మండపం, అంబత్తూర్ మండలం 84వ వార్డు తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలనీలోని కిరణ్ ప్యాలెస్, అన్నా నగర్ మండలం 99వ వార్డు రాజా అన్నామలై రోడ్డులోని ధర్మప్రకాష్ కల్యాణ మండపం, వలసరవాక్కం మండలం 153వ వార్డు పోరూర్ ఆర్ముగం నగర్‌లోని పీజే ఎస్ మహల్, పెరుంగుడి మండలం 185వ వార్డు ద్రౌపతి అమ్మవారి ఆలయ వీధిలోని ఎస్ఆర్కే మహల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్న శిబిరాల్లో ప్రజలు పాల్గొని వినతిపత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలిపింది.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అన్నామలై ఆలయంలో ప్రతి నెలా పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. ఆ ప్రకారం, ఆడి నెల పౌర్ణమి ఈ నెల 8వ తేది మధ్యాహ్నం 2.43కి ప్రారంభమై, 9వ తేది మధ్యాహ్నం 2.18 గంటల వరకు కొనసాగనుంది. ఈ ఘడియలు గిరి ప్రదక్షిణకు అనుకూల సమయమని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

8,9 తేదీల్లో 1,040 ప్రత్యేక బస్సులు

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ఈ నెల 8,9 తేదీల్లో 1,040 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 8న 340 బస్సులు, 9న 350 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 8,9 తేదీల్లో తలా 55 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి 8,9 తేదీల్లో తలా 20 బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై తదితర ప్రాంతాల నుంచి ఇతర నగరాలకు 200 ప్రత్యేక బస్సులు, సెలవుల తరువాత తిరిగి వచ్చే వారి సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.21 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,928

తలనీలాలు సమర్పించినవారు: 29,297





ఐసర్‌లో పట్టాలు అందుకున్న విద్యార్థులు



స్నాతకోత్సవానికి హాజరైన బోర్డ్ ఆఫ్ గవర్నర్ సెనేట్ కమిటీ సభ్యులు

భవిష్యత్ శాస్త్రీయశక్తిగా తిరుపతి ఐసర్

తిరుపతి ఐసర్ భవిష్యత్ శాస్త్రీయ ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మారిందని, ఐసర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య చెప్పారు. స్నాతకోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో తమ విద్యాసంస్థ శాస్త్రీయ శక్తిగా ఎదుగుతుందన్నారు ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలకు శాస్త్రీయ దీపకాంతిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 210 పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ప్రకారం తిరుపతి ఐసర్ దేశంలోన్ని 33వ ర్యాంకు సాధించిందన్నారు. స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో టాప్ 2 పర్సెంట్ శాస్త్రవేత్తల్లో 8మంది తిరుపతి ఐసర్ ఫ్యాకల్టీ ఉన్నారన్నారు. ఈ యేడాది నుంచి ఎంఎస్ రీసెర్చ్, డీఎస్ ఇన్ ఎకనామిక్స్, స్టాటికల్ సైన్స్(బీసీ-ఈఎస్ఎస్)కు శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతి ఐసర్‌లో విద్యార్థులకు ఇంటిని మర్చిపోయే వాతావరణముందన్నారు. అత్యాధునిక సదుపాయాలు కల్పించామన్నారు. రూ.9 కోట్లతో క్రికెట్ స్టేడియాన్ని మల్టీపర్పస్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

ఐసర్‌లో సందడిగా పట్టాభిషేకం

- 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- క్యాంపస్‌లో వెల్లివిరిసిన ఉత్సాహం



ఫొటో పాయింట్



స్టిల్ అదిరిపోలా..!

ఏర్పేడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐసర్ ఆరో స్నాతకోత్సవం ఆనందోత్సాహాలకు వేదికైంది. మంగళవారం ఉల్లాస వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. పట్టాలను అందుకుంటూ పట్టరాని సంతోషాన్ని పంచుకున్నారు. కేరింతలు కొట్టారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గోదావరి బయో రీఫైనరీస్ చైర్మన్, విద్యా విహార్ యూనివర్శిటీ ఛాన్సలర్ సమీర్ సోమయ్య హాజరయ్యారు. ముందుగా ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య చేతుల మీదుగా 255 మంది విద్యార్థులకు డిగ్రీలను అందుకున్నారు. సమీర్ సోమయ్య, బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఝిల్లుసింగ్ యాదవ్, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్యలు వివిధ రంగాల్లో, విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, రజత పతకాలను ప్రదానం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ కోహ్లి, జాయింట్ రిజిస్ట్రార్ రమేష్, డీన్లు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భావోద్వేగాల నడుమ వీడ్కోలు

తిరుపతి ఐసర్‌లో తమ చదువు ముగించి పట్టాలందుకున్న విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు.కొందరి కళ్లలో సన్నటి కన్నీటి పొర తొంగిచూసింది. విద్యాసంస్థను వీడిపోతున్నామనే బాధను దిగమింగుకుంటూ విద్యార్థులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఐదేళ్ల పాటు కలిసి చదువుకుని, శాస్త్రీయ పరిశోధనల్లో మేటి అనిపించుకున్న వీరంతా ఆటోగ్రాఫ్‌లు ఇచ్చుకుంటూ ఒకరికొకరు వీడ్కోలు పలికారు.



చివరగా ఓ సెల్ఫీ

పట్టాల పండుగలో సందడి

స్నాతకోత్సవానికి 255 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్నేహితులు ఉత్సాహంగా హాజరయ్యారు. 22 పీహెచ్‌డీలు, 8 సమగ్ర పీహెచ్‌డీలు, 3 ఎంఎస్ డిగ్రీలు, 141 ఫ్లాగ్‌షిప్ డీఎస్ ఎంఎస్ డిగ్రీలు, 69 ప్రొఫెషనల్ మాస్టర్ డిగ్రీలు, 6 డీఎస్ డిగ్రీలు, 6 డీఎస్సీ డిగ్రీ పట్టాలను విద్యార్థులు అందుకుంటున్నప్పుడు హాలు కరతాళధ్వనులతో మారుమోగింది. కొంతమంది విద్యార్థులు డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ కోహ్లీతో కలిసి ఉత్సాహం పంచుకున్నారు.

బిడ్డతో హాజరైన విద్యార్థిని

కేరళకు చెందిన డోనామారియా ఐసర్‌లో ఐదేళ్లు చదివింది. స్నాతకోత్సవానికి భర్త ప్రవీణ్, రెండు నెలల చిన్నారితో కలిసి హాజరై పట్టాను అందుకుంది. ఆమెను పలువురు అభినందించారు.



అమ్మకు పట్టా..

అవార్డులు అందుకున్న వారు వీరే

తిరుపతి ఐసర్‌లో విశేషప్రతిభ కనబరిచిన కొందరు విద్యార్థులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. డీఎస్ ఎంఎస్ ప్రోగ్రాంలో హనీఫ్ ముఖోపాధ్యాయ్(బంగారు పతకం) మ్యాథమెటిక్స్‌లో ఆర్‌సీ విష్ణు ప్రశాంత్(రజతం), డీఎస్ఎంఎస్‌లో ఆర్.విఘ్నేశ్వరన్(సిల్వర్) బీఎస్ఎంఎస్ పోగ్రాంలోఆస్మా చిరుణి(బెస్ట్ గ్రాడ్యుయేటింగ్ స్టూడెంట్), అర్జిత్ శంకర్ బెనర్జీ (బెస్ట్ స్టూడెంట్ క్యాంపస్) పురస్కారాలు పొందారు.



సిల్వర్ మెడల్ అందుకుంటున్న విఘ్నేశ్వరన్, ఆర్‌సీ విష్ణుప్రశాంత్.. మరో రెండు విభాగాల్లో అవార్డు తీసుకుంటున్న టి.అస్మాషిరిన్, అర్జిత్ శంకర్ బెనర్జీ

తిరుత్తణి ఏఎస్పీగా షీబన్ తిమాన్



ఆలయం వద్ద ఏఎస్పీ

తిరుత్తణి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమితులైన షీబన్ తిమాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన తిరుత్తణికి వెళ్ళి వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ సురేష్‌బాబు తదితరులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయనను వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మదురై ఆధీనం కేసులో పోలీసు శాఖకు నోటీసులు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తనకు వ్యతిరేకంగా నమోదైన కేసు రద్దు చేయాలని కోరుతూ మదురై ఆధీనం దాఖలుచేసిన పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని పోలీసు శాఖకు మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది. కాటాన్‌కొళత్తూర్‌లో మే నెలలో జరిగిన శైవ సిద్ధాంత మహానాడులో పాల్గొనేందుకు వస్తున్న మదురై ఆధీనం కారును మరో కారు ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఈ విషయమై మహానాడులో మాట్లాడిన మదురై ఆధీనం.. తనను హతమార్చేందుకు కుట్ర జరుగుతోందని, తన కారును ఢీకొన్న కారులో వచ్చిన వ్యక్తులు గడ్డంతో ఉన్నారని ప్రసంగించారు. మదురై ఆధీనం మాటలు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయంటూ నగరానికి చెందిన న్యాయవాది రాజేంద్రన్ అందజేసిన ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ మదురై ఆధీనం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి భరత్ చక్రవర్తి విచారించగా ఆధీనం మాటలు వ్యతిరేకిస్తూ అందజేసిన ఫిర్యాదులపై కేసులు నమోదుచేశామని, మదురై, కోయంబత్తూర్ వంటి ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయని పోలీసు శాఖ తరఫు న్యాయవాది తెలిపారు. మతసామరస్యాన్ని దెబ్బతీసేలా ఆధీనం వ్యాఖ్యలున్నాయని, ఈ పిటిషన్‌పై స్పందించేందుకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. పోలీసు శాఖ అభ్యర్థన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, ఆధీనం పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని పోలీసు శాఖను ఆదేశించి తదుపరి విచారణ ఈ నెల 14వ తేదీకి వాయిదావేశారు.

రైల్వే గేట్ మూసివేయాలని ఆందోళన

- కడలూరులో పట్టాలపై బైఠాయించిన జనం



రైలు పట్టాలపై బైఠాయించిన ఇలక్కియనూరు గ్రామ ప్రజలు

చెన్నై, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో మానవ రహిత రైల్వేగేటు మూసివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రైలు పట్టాలపై బైఠాయించారు. కడలూరు జిల్లా వేప్పూరు సమీపం ఇలక్కియనూరు గ్రామం మీదుగా విరుదాచలం నుండి సేలం నగరానికి రైళ్లు వెళుతుంటాయి. అక్కడ మానవరహిత రైల్వేగేట్ దాటుకుని పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రైల్వే గేటు వద్ద గేట్ కీపర్ లేకపోవడంతో రైళ్ల రాకపోకలు తెలియక స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గేట్ కీపర్‌ను నియమించాలని, లేకుంటే ఆ రైల్వే గేటు శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రైలు పట్టాలపై బైఠాయించారు.

పెరిగిన పూల ధరలు

పెరంబూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో పూలు దిగుమతులు తగ్గడంతో వాటి ధరలు పెరిగాయి. ఆ ప్రకారం, మల్లెలు కిలో రూ.400 నుంచి రూ.500, ఐస్ మల్లి రూ.300 నుంచి రూ.400, జాజిమల్లి రూ.250 నుంచి రూ.400, కనకాంబరాలు రూ.600 నుంచి రూ.800, అరళి పూలు రూ.200 నుంచి రూ.300, చామంతి రూ.200 నుంచి రూ.240, సంపంగి రూ.100 నుంచి రూ.200, చాక్లెట్ రోజ్ రూ.140 నుంచి రూ.160, పన్నీర్ రోజ్ రూ.120కి విక్రయిస్తున్నారు. ఈ విషయమై పూల వ్యాపారుల సంఘం ఉపాధ్యక్షుడు ముత్తురాజ్ మాట్లాడుతూ... వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో పూల ధరలు పెరిగాయన్నారు. అలాగే, ఈ నెల 8వ తేది వరలక్ష్మి వ్రతం కావడంతో బుధవారం నుంచి పూల ధరలు పెరిగే అవకాశముందని తెలిపారు.

విజ్ఞాన దర్పణం సంస్కృత భాష

- ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు
- భాషోత్సవ సదస్సులో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సంస్కృత భాషలో వైజ్ఞానికం దాగిఉందని ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు అన్నారు. రామసేతు, బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం తదితర నిర్మాణాలు సంస్కృతంలోని వైజ్ఞానికతని తెలియజేస్తాయన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన భాషోత్సవం జాతీయ సదస్సు ముగింపు, అక్షర పురుషోత్తమ మందిర ఆవిష్కరణ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామితో కలిసి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీలోని హెరిటేజ్ కారిడార్‌లో నిర్మించిన స్వామి నారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ మందిరాన్ని వారు ఆవిష్కరించారు. జగన్నాథమందిరంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గవర్నరు, సీఎంలకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సభాకార్యక్రమంలో గవర్నరు హరిబాబు మాట్లాడుతూ..సంస్కృతభాష మానవ జీవనాన్ని నడిపించే లివింగ్ లెగసీ అన్నారు. తనస్వగ్రామం తిమ్మసముద్రంలో సంస్కృత ఓరియంటల్ కళాశాల ఉండేదని, అక్కడ సంస్కృతాన్ని చక్కగా బోధించేవారని గుర్తు చేసుకున్నారు. సంస్కృతంలోని పాణినీయ వ్యాకరణం నేటి కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, ఆధునిక ఏఐకి ఉపయోగకరమన్నారు.



పుస్తకావిష్కరణలో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామి తదితరులు

సంస్కృతంలో భారతీయ జ్ఞానపరంపర

సీఎం పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. భారతీయ జ్ఞానపరంపర సంస్కృతభాషలోనే నిగూఢమై ఉందన్నారు. నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం, రాజనీతిశాస్త్రం తదితర సర్వవిధార్మికాంశాలు ఇందులోనే ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతభాషాభివృద్ధికి వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అధ్యాపకులను సాధు భద్రేశదాస్‌స్వామి చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి, శ్రీపరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.గణపతిభట్, థింక్ ఇండియా కౌన్సిల్ మెంబర్ సౌరవ్‌పాండే, కోఆర్డినేటర్ డాక్టర్ జ్ఞానరంజన్‌పండా, ఉత్తరాఖండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కె.రుహెల్లా, డీన్లు, హెచ్‌వోడీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

27నుంచి కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. 27న వినాయక చవితితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.28న ధ్వజారోహణం ,హంస వాహన సేవ, 29న స్వర్ణ నెమలి వాహనం, 30న మూషిక వాహన సేవ, 31న స్వర్ణ శేషవాహన సేవలు, సెప్టెంబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహన సేవ, 2న గజ వాహన సేవ, 3న రథోత్సవం, 4న తిరుకల్యాణం, అశ్వ వాహన సేవ, 5న ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికారనంది వాహన సేవ, 7న రావణబ్రహ్మ వాహన సేవ చంద్ర గ్రహణం కారణంగా ఉదయం నిర్వహిస్తారు. 8న యాళి వాహన సేవ, 9న సూర్యప్రభ వాహన సేవ, 10న చంద్రప్రభ వాహన సేవ, 11న కల్ప వృక్ష వాహన సేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి సేవ, 14న కామధేను వాహన సేవ, 15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులు ఇబ్బంది పడకూడదు

'కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఇబ్బంది పడకుండా చూడాలి. దీనికి క్షేత్రస్థాయి సిబ్బంది కీలకపాత్ర పోషించాలి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, ఎస్పీ మణికంఠ అన్నారు. ఆలయ ఈవో కార్యాలయ భవనం వద్ద ఉన్న సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో ఈవో పెంచలకిషోర్ అధ్యక్షతన బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 21 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని కోరారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే వీఐపీలకు, ఉభయదారులకు స్వామి దర్శనానికి ప్రత్యేక సమయం కేటాయిస్తామని చెప్పారు. అలాగే ప్రతి సామాన్య భక్తుడూ తమకు వీఐపీతో సమానమని, ఉద్యోగులు భక్తితో సేవ చేస్తే బాగుంటుందని సూచించారు. బ్రహ్మోత్సవాల్లో విస్తృతంగా అన్నదానం చేయడానికి తగిన ఏర్పాట్లను చేస్తామన్నారు. ఆలయం వద్ద విద్యుత్ అసౌకర్యం కల్గకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిత్తూరు, తిరుపతి నుంచి ఆర్టీసీ బస్సులను అదనంగా నడపాలన్నారు. ప్రొటోకాల్ విధులకు తహసీల్దార్లు, డీటీలను నియమించుకోవాలని ఆర్డీవో శ్రీనివాసులుకు సూచనలిచ్చారు. చిత్తూరు నుంచి కాణిపాకం వచ్చే రహదారిలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లు, నైపుణ్యం కలిగిన డాక్టర్లను నియమించాలని డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంహెవో వెంకటప్రసాద్‌కు ఆదేశాలిచ్చారు. ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉభయదారులు, భక్తులు సహకరించాలని కోరారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా 21 రోజుల పాటు తాను కూడా సామాన్య భక్తుడిలా స్వామి దర్శనానికి విచ్చేస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, తహసీల్దార్ లోకేశ్వరి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

- లాకప్‌డెత్ కేసు..

సీబీఐ కస్టడీకి ఐదుగురు పోలీసులు

ప్యారీస్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తరుభువనంలో జరిగిన లాకప్‌డెత్ కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం ఐదుగురు పోలీసులను సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. నగల చోరీకి సంబంధించిన ఫిర్యాదులో ప్రత్యేక పోలీసు విభాగానికి చెందిన పోలీసులు చట్టవిరుద్ధంగా ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌ను విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళి దాడిచేసి హత్యమార్చిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలంరేపింది. ఈ వ్యవహారంలో అజిత్‌కుమార్‌పై దాడికి పాల్పడిన కన్నన్, ప్రభు, ఆనంద్, రాజా, శంకర మణికంఠన్ అనే ఐదుగురు పోలీసులను అరెస్టు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ అధికారులు గత రెండు వారాలుగా హత్యకు సంబంధించి అజిత్‌కుమార్ తల్లి మాలతి, సోదరుడు నవీన్‌లను, అజిత్‌పై ఫిర్యాదు చేసిన నిఖిత, పోస్టుమార్టం చేసిన వైద్యులు, మడప్పురం ఆలయ సిబ్బంది వద్ద విచారణ జరిపి వారి వాగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. ఇదిలా ఉండగా, జైలులో ఉన్న ఐదుగురు పోలీసులను విచారణ నిమిత్తం తమ కస్టడీలోకి అప్పగించాలని కోరుతూ సీబీఐ తరుపున మదురై జిల్లా కోర్టులో దాఖలైన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఐదుగురు పోలీసులను రెండ్రోజులు సీబీఐ కస్టడీకి అనుమతించిన న్యాయస్థానం, వారిని బుధవారం సాయంత్రం 5.30 గంటలకు తిరిగి అప్పగించాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు.

టి.నగర్ పోస్టాఫీసులో రూ.25 లక్షల స్వాహా

అడయార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ హబీబుల్లా రోడ్డులో ఉన్న ప్రధాన పోస్టాఫీసులో నకిలీ బిల్లులతో రూ.25 లక్షల మేరకు స్వాహా చేసిన అకౌంటెంట్‌ను మాంబాళం పోలీసులు విచారణ జరుపుతున్నారు. నగరంలోని పలు పోస్టాఫీసులకు ఫర్నిచర్ కొనుగోలుచేసినట్టుగా నకిలీ బిల్లులు సృష్టించి రూ.25 లక్షల వరకు మోసం చేసినట్టు పోస్టాఫీసు డిప్యూటీ సూపరింటెండెంట్ బాలసుబ్రమణియన్ మాంబాళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ పోస్టాఫీసులో అకౌంటెంట్‌గా పనిచేసే మణికంఠన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.